# ఓ 'సత్యం' కథ

జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం

నీ ప్రవర్తన బాగుండదు ! నువ్వంటే మాకసహ్యం. నీ జీవితంలో - నీముఖం మాకు చూపించవద్దు, అంతే కాదు - నీ ఉత్తరం కూడా మమ్మల్ని చేరటానికి వీలులేదు !

కరక్టుగా నౌఖరీలో ప్రవేశించటానికి బయలు దేరుతున్నాను. అప్పుడు వచ్చిందా ఉత్తరం. రాసింది సత్యం. నాకంటే వయసులో ఇరవై ఏళ్ళ పెద్ద! స్వయానా నాకు మేనమామ.



మొదట ఆ ఉత్తరం చదవగానే వంటి మీద గుగ్గిలం చల్లినట్లయింది. గునపంతో గుండెని పెకలిస్తున్నట్లు ఫీలింగ్, పెనమ్మీద నీటి చుక్కలా అల్లల్లాడేను.

నాకు ఏస్కూల్లో ఎవరూ ఇవ్వని కితాబు! నా బతకు ఛానల్ మీద రంగుల్లో ప్రదర్శి స్తున్న నగ్న చిత్రం !! నేను వాళ్ళకి చేసిన అప కారం ఏమిటో నాకు తెలియదు. ఇంత అభాండం నా నెత్తిన ఎందుకు రుద్దుతున్నారో నాకసలు తెలియదు.

అసలు మొదటి నుంచీ వారిదృష్టిలో నేను చీపురుకట్టలానే వున్నాను. నాకు తెల్సు - కొందరు పులుకడిగిన ముత్యంలా కనిపిస్తారు పైకి. వారి అంతర్యాల్లో మురికి పేరుకు పోయివుంటుంది. ఆ కోవకి చెందిన వాడే మావయ్య. ముళ్ళ కంచెమీద తెల్లగుడ్డ మంచుపొరల్లో వెన్నముద్దలా కన్పిస్తుంది. నేను తెల్సుకున్న సత్యమది.

ఇంటిముందు గుర్ఖాలా సేవించేను. అయిన వారి పెంపుడు కుక్క పాలిటి చేయలేక పోయాను. అది నాదురదృష్టం ! నా తరుగు అవసరం నాది. కాలం వెళ్ళదీస్తేగాని సాగనిస్థితి నాది. అందుకే - సహనం దుప్పటిని ముసుగేసుకుని, రోమరోమానా ఓరిమిని నింపుకుని నెట్టుకొస్తున్నాను. మరో రెండేళ్ళ గడిపితే...ఇంటర్ పూర్తవుతుంది. అదీ నా ఆశ ! అమ్మ కంటే ఆరేళ్ళ చిన్నట ఆయన. అమ్మ చేతి ముద్దలుతిన్నాడట. అమ్మ మాంగల్యం ఒకనాడు అమ్మి ఇచ్చిన డబ్బు ఆయనకి బతుకు ప్రసాదించిందిట. అమ్మ వచ్చినప్పుడు అప్పుడప్పుడూ చాటుగా నాతో



చెప్పుకుని వాపోతుండేది. కన్నీరు రాల్చేది.

మనం స్పందించేమని ఎదుటివారిలో ప్రతిస్పందన కోరుకోవటం - వుండాలనుకోవటందోషం అనేవాడ్ని. అమ్మవినదు. చూరుకి పట్టిన బూజు దులిపిన క్షణమే ! మర్నాటికి మామూలే అని నచ్చచెప్పేవాడ్ని.

ఐదేళ్ళ క్రితం

ఆ రాత్రి వారి మధ్య ఏం జరిగిందో నాకు తెలియదు. గుసగుసలు లీలగా వినవస్తున్నై. అమ్మమ్మ- భానూ పిన్ని అత్తయ్య మావయ్య గదిలోపల్నుంచి. నేను పంచలో పడుకున్నాను. అయితే ఆశిఖరాగ్ర చర్చ నాగురించేనని అప్పుడు తెలియదునాకు. పీకుతున్న కాళ్ళని సలుపుతున్న ఒంటిని అమృతాంజనంతో వదిలించుకోవాలని తీవ్రప్రయత్నంలో వున్నాను.

తెల్లవారితే సోమవారం ! స్కూలుకి వెళ్ళాలి. ఓ పట్టాన నిద్రరాదు. మోసిన బరువు అలాంటిది. ఒకటా రెండా - 4 కిలోమీటర్లు దూరం సైకిల్‌మీద అష్టతొక్కుడు ప్రయాణం. వెనక పిప్పళ్ల బస్తాలా సరోజ! ఎనిమిదేళ్ళకే అది పంచదార బస్తాలా వుంది. దాన్ని వాళ్ళమ్మమ్మ గారింటి దగ్గర దించివచ్చేను. ప్రతివారం వుండే కొలువే అదినాకు.

శనివారం సాయంత్రం దిగడుతుంది. ఇక్కడికి. ఆదివారం రాత్రి వరకూ మింగి ఇక్కడ అప్పుడు చెక్కేస్తుంది. ఆ రెండురోజులు దాని మురిపెం, ఠీవి ఉజ్జయినీ రాకుమారికి కూడా జరగవు. ప్రదర్శించే దర్పం. అధికృత చెలాయించే అజమాయిషీ - దాష్టికం - తలని ముందుకు వంచి, రెండు కాళ్ళ మధ్యకి చేర్చి, అక్కడ కలిపి ముడివేస్తే - వెన్నులో కలిగినంత బాధ ఎలావుంటుందో అంతలా వుంటుంది.

తప్పదు...!

గతిలేని వార్కి గంజి పాయసమట !

నాలాంటి అల్లుడికి వరంలాంటిది కూడా!

మనసు ఏడుస్తున్నా పైకి నవ్వుతాను !

అభిమానం చీకటికోణంలో కుయ్యోమొర్రోఅంటున్న మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తుంటాను.

అంతే...ఆమర్నాడే ఉద్వాసన చెప్పారు నాకు. కారణం నాకు తెలియదు.

ఒక భుజానికి చంకల కిందుగా తాడుకట్టి - చింతచెట్టుకి వ్రేలాడదీసినట్లైంది నా పరిస్థితి. రెండేళ్లు నా అదృష్టం గిమ్మక్కు చేయమంటే, సవ్యంగా చదువు సాగితే - ఓదారి దొరికేదేమో ! ఏడుపు ముఖం వేసుకుని, శూన్యహస్తాలతో శూన్యంలోకి దృక్కులు మరల్చుకుని తంగేడ పూవులా కొంపకి వచ్చిపడ్డాను.

అమ్మ బావురుమంది.

ఆశలదారం పుటుక్కున తెగిపోయినట్లు ఫీలయింది.

ఆ మర్నాడు విషయం తెల్సుకున్న అమ్మకాళ్ళకి చక్రాలు కట్టుకుని, కళ్ళలో కొనవూపిరి ఆశనిలుపుకుని - బ్రతిమలాడో, భంగపడో - కాళ్లావేళ్ళా పడైనా మళ్లీ నన్నక్కడ దింపాలని వెళ్ళింది.

వారు నుడివింది ఏమిటంటే

మీవాడి ప్రవర్తన బాగుండలేదు. అని ముక్తసరిగా చెప్పి, వచ్చావు కాబట్టి కాసిని మంచినీళ్ళు తాగి వాడి పుస్తకాలు మోసుకెళ్ళు అన్నాడట మావయ్య.

అహహ...ఏం కొడుకుని కన్నావే అని ఈసడించిందట అమ్మమ్మ !

నాకడుపున పుట్టే చంపి పారేసివుందును అందటపిన్ని !

ఇక మీకు మాకు సంబంధాలు లేవు ! రాకపోకలు కూడదు ! మీరెవరో మేమెవరో ! వెళ్ళండి ! నిష్కర్షగా చెప్పి గదిలోకి దూరి తలుపేసుకుందట అత్తయ్య.

అయ్య పోయిన దగ్గర్నుంచీ పరుల కొంపలో ఊడిగం చేసుకుని బ్రతికిన అత్తయ్య గతంమరిచిపోయింది. ఆఫీసరుగారి భార్య హోదా వచ్చింది కదా !

అమ్మ నిగ్గదీసింది నన్ను ! ఏం చేశావురా అని.

ఏవన్నా చేస్తే కదూ చెప్పటానికి ...చెప్పాను.

తలకొట్టుకుంది అమ్మ. అంతకన్నా చేయగలిగింది లేదుకాబట్టి.

ఆ తర్వాత మూడేళ్ళకి -

ఓరోజు మావయ్యకి ఉత్తరం రాశాను. కిందచేయనాది.అభిమానం చంపుకుని క్షమార్పణలు వేడ్తూ - మీపట్ల అనుచితంగా ప్రవర్తించివుంటే క్షమించమని, చదువు ఎటూ కొడికూసింది, కనీసం, మీ ఆఫీసులో సబ్‌స్టాఫ్ పోస్టుకి అప్లై చేస్తున్నాను. కనికరించి ఈ మేలుచేస్తే అజన్మాంతం ఋణపడివుంటానని రాశాను.

సమాధానం లేదు.

నా అదృష్టం బాగుంది. మరో కంపెనీలో ఉద్యోగం దొరికింది. జాయినవ్వటానికి వెళ్తుంటే అప్పుడు వచ్చిందా ఉత్తరం.

ప్రవర్తన ! ప్రవర్తన ! ప్రవర్తన !

పిచ్చికుక్క అరుపుల్లాగింజుకుంటున్నారు. వీరంతా....నీ ప్రవర్తన గురించి..నేనేమన్నా హత్య చేశానా? దొంగతనం చేశానా? పోనీ దుర్భాషలాడేనా? ఎవరికైనా లైను వేశానా? లేక ఏ ఆడపిల్ల మీదైనా చేయివేసేనా..? కనీసం లేకిగానైనా ప్రవర్తించలేదే... మరెందుకు వీళ్ళంతా నాపైన పగబట్టేరు.

ఓ విధమైన అసహ్యం ఏర్పడింది నాలో వాళ్లమీద. ఆ అసహ్యం వారు ఎదురు పడితే కృతజ్ఞతకి నమసిపోతుందన్న భయంతో ఉత్తరం ప్రేముకట్టించి, రో[illegible] ఒకసారైనా చూసుకుంటుంటాను..

ఊరి ప్రెసిడెంటు ఇచ్చిన ప్రశంసా పత్రంలా దాన్ని బహుజాగ్రత్తగా చూసుకుంటున్నాను.

ఉద్యోగంలో స్థిరపడిపోయాను

48 మసాలు జరిగై

ఒకరోజు-

కూరగాయల మార్కెట్టులో కలిసేడు చిదంబరం.

చిదంబర మంటే రావుగారి మేనల్లుడు. రావుగారంటే మావయ్య స్నేహితుడు. ఉభయులు ఒకే వీధిలో కాపురం వుండేవారు. ఒకే ఆఫీసులో ఉద్యోగం. మావయ్యకంటే ఓ ఐదారేళ్ళు పెద్ద. మావయ్యకి మంచి అంద. రావుగారు నాకు బాగా పరిచయం. మంచివాడు. వెన్నముద్దలాంటి మనిషి. తేనెలో

**అసలు మొదటి నుంచీ వారి దృష్టిలో నేను చీపురుకట్టలానే వున్నాను. నాకు తెల్సు - కొందరు పూలు కడిగిన ముత్యంలా కనిపిస్తారు పైకి. వారి అంతర్యాల్లో మురికి పేరుకుపోయి వుంటుంది. ఆకోవకి చెందిన వాడే మావయ్య. ముళ్ళ కంచె మీద తెల్లగుడ్డ మంచు పొరల్లో వెన్నముద్దలా కన్పిస్తుంది. నేను తెల్సుకున్న సత్యమది.**

స్నానం చేసినమనసు ఆయనిది. మకరందం గ్రోలినవాక్కు ఆయనది. పసిపిల్లవాడి మనస్తత్వం.

తపస్సుచేస్తే కానీశంకరుడు వరమీయడు. ఈయన్ని కోరితేచాలు హడావిడి పడిపోయి కిందనుంచీ పైదాకా మోసేస్తారు. ఆయన్తో మాట్లాడుతుంటే పచ్చకర్పూరం జేబులో వుంచుకున్నట్లుగా వుంటుంది. వెన్నెల రేయి డాబామీద కూర్చుని అలవోకగా సితారా మీటుతున్న అనుభూతి కల్గుతుంది. రసమలై తింటూ, రసవాహినిలో ఓలలాడుతున్నట్లుగా ఓచక్కని రసానుభూతి కమ్మేస్తుంది ఆయన సమక్షంలో. ఒక్క మాటలో చెప్పాలంటే మనసు వయొలిన్ మీద మంచితనం కమానుగా వుపయోగించి మానవత్వపు రాగాన్ని కచేరి చేయటం అదీ ఆయననైజం.

నాపట్ల ఆయనకి వాత్సల్యం. ఎప్పుడు కనిపించినా రా....రా....అంటూ ఆప్యాయంగా పిల్చి, వయసు తారతమ్యం ఎరుగకుండా అనర్గళంగా మాట్లాడేవారు. అప్పుడప్పుడు సైకిల్ వెనుక ఎక్కించుకొని తిప్పేవారు. ఓసారి ప్యాంటు షర్టు కొనిపెట్టారు. వద్దన్నా సరే.

అప్పుడు ఇంట్లో రేగిన తుఫాను . తీరం దాటింది.

ఛీ.....ఛీ.... సిగ్గులేదు ముష్టివాడా అంది అత్తయ్య.

అమ్మమ్మ మెడలు వంచి రెండేసింది.

నీకు లోటేంచేశాన్రా రాస్కెల్! నా పరువు తీస్తున్నావు అంటూ మావయ్య వాయిం చేడు.

లుంగచుట్టి వాటిని అవతలకి విసిరేసింది. పిన్ని వాటిని అక్కసుగా...

గొంతెత్తలేని దౌర్భాగ్యం !

వీధి వెంట వెళ్ళే బిచ్చగాడ్ని వూరకుక్కలు అటకాయించినట్లుగా అటకాయించేరు. గుండె చిల్లు పడ్డా అదుముకున్నాను. ఒకసారి బడికివస్తే తెలుస్తుంది. పిల్లలు ఈ చొక్కాలు చూసిఎలా ఎద్దేవచేస్తున్నారో ! కలర్‌కాంతి రావని నికనేం పెట్టిఎలా ఏడిపిస్తున్నారో... అరిచి చెప్పాలనిపించేది. లేమి గొంతుకి అడ్డం పడేది. పర్యవసానం తెల్సిన వాడ్ని కనుక, ఈ సైజు చేయించుకున్న చొక్కాలకి కూడా గతిలేని వాడ్ని కనుక గుప్పెట విడేదికాదు.

మర్నాడు వెళ్ళి తిరిగి ఇచ్చేశాయనికి.

అప్పుడు ఆయన అన్న మాటలు నాజీవితంలో మరిచి పోలేనివి..

ఎంచే వారి నోటికి ఎప్పుడూ ఎల్లలు వుండవురా మురళీ మనం ఎక్కడ నాల్గు గోడలు కడ్తే అక్కడ అదే మరుగుదొడ్డి అవుతుందిరా. కాల మార్పులలో అదే మరుగుదొడ్డి కొంతకాలానికి వంటశాల అవుతుంది. అని...

అవును. అక్షరాలా నిజం ! నిజం ! నిజం!


అప్పుడప్పుడు అమ్మమ్మ రావుగార్ని మెచ్చుకునేది. శ్లాఘించేది. ఆయన చేసిన మేలుని గురించి గొప్పగా అభివర్ణించేది. అప్పుడు అంటే ఆరోజు అమ్మమ్మ అన్నం తినట్లు లెక్కనాకు. ఆయన్ని తెగనాడినప్పుడెల్లా అదో లెక్క వుండేది నాకు - అదీ అమ్మమ్మ నైజం.

ఎందుకంటే నీకు వాళ్ళంటే కోపమని, పైగా ఆవేశపరుడివి, లేనిపోని గొడవలవుతాయని చెప్పలేదింతకాలం అందిక్లుప్తంగా.

ఎలా తెల్సు అడిగాను ఆశ్చర్యంగా

రావుగారి తమ్ముడు పిల్లల్ని మనదగ్గిరే చేర్చారు.

మనవెనక సందులోనే వుంటున్నారాయన. రావుగారు ఈవూరొచ్చి రెండేళ్ళు దాటింది కూడా అంది.




అలాంటి రావుగారి కుటుంబం విచ్ఛిన్నమైంది. కారణం మావయ్యట ! ఆ కథంతా పూసగుచ్చినట్లు చెప్పాడు చిదంబరం దారిలో. అట్నుండి అటే మూర్తిగారి దగ్గరకి వెళ్ళాను. మనిషి మునపటిలా లేడాయన. నన్ను గుర్తుపట్టి ఆ వేదనకి లోనైనారు. కళ్ళు చిప్పిల్లాయి. వెన్నెల పరుచుకున్నట్లుండే ఆయన వదనం ఇప్పుడు ఆముదం మసి బారిన పళ్ళెంలా వుంది. కళ్ళలో వెలుగు లేదు. దిగులు పట్టీల్లా వున్నై. మనిషి బాగా కుంగి పోయివున్నాడు. దిగులు మూటకట్టినట్లు న్నాడు. అవమాన భారంతో వంగి పోయి వున్నాడు. పలకరిస్తుంటే కళ్ళు చెమరుస్తున్నై అపశ్రుతి వింటున్న వాడిలా వొణికి పోతున్నారు. పందెం కోడిలా గడ్డిపూవు మెత్తని గులాబీ మీద విరుచుకుపడితే రేకులు రాలిపోయి ఏడుస్తున్న రోజాలా గోచరించాయి.

నాగుండె కవాటం దగ్గిర నరం పెకలించి, తెంచిముడి వేసినట్లుగా బాధసలుపు తోంది నన్ను! బొడ్డుమీద కట్టేసిన ఎలుక బొరియలు చేస్తుంటే కలిగేబాధలాంటి బాధ మెలి వేస్తున్నది. సూర్యకిరణం భూతద్దంలోంచి, ప్రవహించి, శరీరంమీద చుక్కలాపడి ఎలా చురచురలాడ్తుందో అంతలా చురచుర లాడ్తున్నది మనసు.

ఇంటికి రాగానే అమ్మకి చెప్పాను.

అమ్మ ఆశ్చర్యపోలేదు. నాకు తెల్సా విషయమంతా! ఏనాడో, కానీ నీకు చెప్పలేదు.

అమ్మ కుటుంబపోషణకి ఆసరాగా వుంటుందని ఇంటి దగ్గరబేబీ కేర్ సెంటర్ ప్రారంభించింది. మా పేటలోని పిల్లలంతా మా ఇంట్లోనే వుంటారు పగలంతా !

ఛీ....ఛీ...ఏం మనిషి?, అన్నలా ఆదరించేడు ఉద్యోగమిప్పించేడు, ఓ ఆసరాగా నిల్చేడు- అలాంటి మేలు చేసి నాయన భార్యతల్లితో సమానంకదూ...అసహ్యం వేసింది.

అమ్మ మాట్లాడలేదు.

ఇంతకీ జమ్మగారిప్పుడు ఎక్కడ వుంది అడిగేను.

తెలియదు. అసలు వుందో లేదో కూడా తెలియదు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన రోజు రాత్రి మాయమైందట ఆవిడ. మావయ్య అక్కడ్నుంచే ట్రాన్స్ఫర్ చేయించుకు మరో రాష్ట్రం వెళ్ళాడట. అప్పుడు ఇంకో విషయం తెల్సా నీకు. నిన్నెందుకు పంపించారో తెల్సా....?

తెలియదు...తల అడ్డంగా వూపేను.

స్కూలు పుస్తకాల్లో సెక్సు పుస్తకాలు పెట్టి చదువుతున్నావని. పిల్లకి ఈడొస్తుందని, పెళ్ళికెదిగిన చెల్లెలు ఇంట్లో వుందని.

దిమ్మెర పోయాను.

తనబుద్ధి అలాంటిదని అందరూ అలాగే అనుకున్నారా? అన్నం వడ్డించే వారి రొమ్ములు చూడటానికి తనలాగా సంస్కారహీనుల నుకున్నాడా? వావివారసలు తెలియని పశు

ప్రాయు డనుకున్నాడా? తనంటే ఉచ్ఛం నీచం తెలియని మనిషి, కామంతో కళ్ళు మూసుకు పోయినవాడు. న స్న్వాఆగాటకే ఊహిస్తారా ...సిగ్గులేదూ...మనిషి జన్మఎత్తితే సరీ... సాగు తోందని సంస్కారం చంపుకుంటే చెల్లని రోజున కాలసర్పాల్లా కాటువేయవా అని బాస్టర్డ్స్ ! అన్నాను వేష్టతో కూడిన కసితో.

నోర్మూయ్ ! పెద్దంతరం చిన్నంతరం వుండనక్కర్లే ! నోటికి ఎంతమాట వస్తే అంత మాట అనేయటమేనా? ఏదో బలహీన క్షణా ల్లో జరిగిందది. ఎంత పశ్చాత్తాప పడ్డాడో నీకేమన్నా తెల్సా అమ్మ మందలించింది.

అవును! ఎంత చెడ్డ తమ్ముడు. వీరంతా ఓ కండెలో దారపు పోగులేగా.. సమర్థింపులకు పకడ్బందిగా వుంటుంది.

మొలతాడుని ఉరితాడుగా మార్చటం - పసుపుతాడుని మొలతాడుగా మార్చుకునే సామర్ధ్యం, లేక మావయ్యలాంటి వాళ్లకి వెన్నతో పెట్టినవిద్య. వీళ్ళింతే. తప్పుచేసి తప్పిం చుకోవటానికి పకడ్బందీగా ఓ వాదన తమ పరంగా రెడిగా వుంచుకోవటంలో నిష్ణాతులు. తమసుఖం కోసం తమ ఆనందంకోసం మరొ కరి జీవితం నాశనమైనా వారికి అనవసరం. శరీరంలోకొవ్వుతోపాటు స్వార్థంకూడా పేరుకు పోయి వుంటుంది వీళ్ళకి.




నా మనో నేత్రం విచ్చుకుంది ఇప్పుడు. చూపులు సారించేను. అక్కడ ఓ చిన్న చుక్క క్రమంగా పెరిగి పెరిగి పెద్దదై హఠాత్తుగా విస్ఫోటనం చెంది. శతసహస్రానేక శక్తులుగా విడి, క్రమంగా ఒకో శకలం ఒకో అవయవంగా రూపుదిద్దుకుని ఓ అస్పష్టమైన ఆకారంగా మారింది. ఆఆకారం చూపుడువేలునిశ్చలంగా నావైపు చూపిస్తున్నది. మిగిలిన నాల్గు వేళ్ళు ఆ ఆకారం ఛాతీలోకి చొచ్చుకు పోతున్నై. ఆ ఆకారం శూన్యంలో విన్యాసం చేస్తున్నది. వికృతధ్వనులు నింగిన తారాడుతున్నై. ఎదురు గానేను తాడులా పడివున్నాను.

ఇప్పుడు తెల్సింది నాకు 'తత్వం'

*

# యువరచయితలకు ఆహ్వానం

శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్, రచన మాసపత్రిక ప్రతినెల ఆఖరు ఆదివారం ఉదయం 10గం. నగర్ కేంద్ర గ్రంథాలయంలో ఓ ప్రముఖ కథకుడిచేత కథకి సంబంధించిన ఓ అంశంమీద ఉపన్యాసం ఏర్పాటు చేయబడుతుంది. సభకు విచ్చేసిన వర్ధమాన రచయితలు ఆ అంశంమీద తమకున్న సందేహాల్ని, ఆ ప్రముఖ రచయితతో ముచ్చటించి నివృత్తి చేసుకోవచ్చు. కథానిక గురించి నలుగురు ఒకచోట చేరి బాగోగుల్ని చర్చించుకోవడానికి, వర్ధమాన రచయితలకు కథానిక గురించి సరైన అవగాహన ఏర్పడడానికి తోడ్పడతాయనే సదుద్దేశంతో ఈ సభల్ని ఏర్పాటుచేస్తున్నాము. కథారచయితలు, కథాభిమానులు ఈ సభలలో పాల్గొని తెలుగు కథానికా వికాశానికి తమ వంతు సహకారాన్నందిస్తారని ఆశిస్తున్నాము. మొదటి సమావేశము జూలై 30.

వేదగిరి రాంబాబు

రచన శాయి

